ప్రజాశక్తి

ఆదివారం 21 ఏప్రిల్ 2024 | 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల



సిపిఎం ప్రజా ప్రణాళిక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి..

- బిజెపితో పొత్తు ఉన్న టిడిపిని, వైసీపీని ఓడించండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య పిలుపు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల పార్లమెంట్‌కు ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జెడి శీలంను, బాపట్ల జిల్లాలోని అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య పిలుపునిచ్చారు. శనివారం బాపట్ల పుచ్చలపల్లి సుందరయ్య జిల్లా ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు టి.కష్ణమోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపు ప్రజల ఎజెండా కావాలన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన మతతత్వ బిజెపి-టిడిపి-జనసేన కూటమిని, నిరంకుశ వైసీపీని ఓడించి ఇంటికి సాగనంపాలన్నారు. జిల్లాలో ఇండియా వేదిక బలపర్చిన బాపట్ల పార్లమెంటు అభ్యర్థి జెడి శీలం, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర అభివద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్య, లౌకికతత్వం పరిరక్షణకు సిపిఎం పోరాడుతోందన్నారు. పదేళ్ల బిజెపి పాలనలో రాష్ట్రానికి హాని తప్ప మేలు జరగలేదన్నారు. జిల్లాలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రజా ప్రణాళిక కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎన్.బాబూరావు, ఎం.ఆంజనేయులు, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, మనోజ్, సుభాషిణి పాల్గొన్నారు.

కలిసి బతకలేక.!
కలిసి మృత్యుఒడికి.!

- పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక.. పిచ్చిగుంట్లపల్లిలో ప్రియుడితో కలిసి ప్రియురాలు ఆత్మహత్య
- వివాహేతర సంబంధం నేపథ్యంలో చింతగుంట్లలో మరో జంట బలవన్మరణం
- మార్కాపురం మండలంలో ఒకే రోజు రెండు ఘటనలు..

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఓ యువ జంట ప్రేమించుకున్నారు.. కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి అంగీకరించలేదు. దీంతో ఇద్దరూ కలిసి బతకలేమని.. పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మరో చోట ఓ వివాహిత, యువకుడికి మధ్య వివాహేతర సంబంధం కొనసాగింది. విషయం తెలిసి.. పెద్దలు మందలించారు. ఇక కలిసి బతకలేమని భావించి.. ఈ జంట కూడా పురుగుమందు తాగి.. బలవనర్మణం చెందారు. ఈ రెండు ఘటనలూ మార్కాపురం మండలంలోని పిచ్చిగుంట్లపల్లి, చింతగుంట్లలో ఒకే రోజు చోటుచేసుకోవడం గమనార్హం.

ప్రేమ జంట ఆత్మహత్య

గోపి (ఫైల్)

నాగేశ్వరి (ఫైల్)

పురుగు మందు తాగి ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మార్కాపురం మండలం, పిచ్చిగుంటపల్లి శివారులోని ఒక తోటలో శనివారం వెలుగు చూసింది. పిచ్చిగుంటపల్లి గ్రామానికి చెందిన నారు వెంకట నాగేశ్వరి(19), అదే గ్రామానికి చెందిన ▶ 2లో

మృతిచెందిన విజయలక్ష్మి, సత్యనారాయణరెడ్డి

వివాహేతర సంబంధం నేపథ్యంలో
మరో జంట బలవన్మరణం

వివాహేతర సంబంధం నేపథ్యంలో మార్కాపురం మండలంలోనే మరో జంట ఆత్మహత్య చేసుకున్న ఘటన రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటన చింతగుంట్ల గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. పెద్దారవీడు మండలంలోని పుచ్చకాయలపల్లికి చెందిన కొమ్ముసాని పోలిరెడ్డికి మాల్యవంతునిపాడు గ్రామానికి చెందిన విజయలక్ష్మి (40)తో 18ఏళ్ల క్రితం ▶ 2లో

ఊపందుకున్న నామినేషన్ల పర్వం

- ఒంగోలులో ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి నామినేషన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నామినేషన్ దాఖలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నామినేషన్ల పర్వం ఊపందుకుంది. ఆయా నియోజకవర్గాలలో పలు పార్టీలకు చెందిన అభ్యర్థులు భారీ ర్యాలీలతో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ల స్వీకరణ మూడో రోజైన శనివారం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. సంతనూతలపాడు, కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. ఒంగోలులో వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన సతీమణి చెవిరెడ్డి లక్ష్మి నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి, ఒంగోలు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ఏఎస్ దినేష్‌కుమార్‌కు అందజేశారు. ఒంగోలు పార్లమెంట్‌కు పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. ఆయా నియోజకవర్గాలలో పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. ఆయా నియోజకవర్గాలలో రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.

సార్వత్రిక ఎన్నికలలో నామినేషన్ల స్వీకరణ పర్వం కొనసాగుతోంది. ఒంగోలు పార్లమెంట్‌తో పాటు 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థులు వారి నామినేషన్లను వేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా సాదాసీదాగా నామినేషన్‌ను దాఖలు చేశారు. వైసిపి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు, శిద్దా రాఘవరావు, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్‌బాబు, వైసిపి నాయకులు రమణారెడ్డితో కలసి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నామినేషన్‌ను దాఖలు చేశారు. అదేవిధంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే విద్యార్థి జెఎసి ఉద్యమ నాయకుడు రాయపాటి జగదీష్ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్‌కు అందజేశారు. కొండపి అసెంబ్లీ నియోజకవర్గానికి మాజీ మంత్రి, వైసిపి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తరపున ఒక నామినేషన్ దాఖలు అయింది. ఒంగోలు పార్లమెంట్, నియోజకవర్గాలలో ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు, యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరు, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరు, గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి ఇద్దరు నామినేషన్లను దాఖలు చేయటం గమనార్హం.

14 నామినేషన్లు దాఖలు

ఒంగోలు పార్లమెంట్, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు మూడో రోజు 14 నామినేషన్లు దాఖలయ్యాయి. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి వైసిపి ఎంపి అభ్యర్థులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 2 సెట్లు, ఆయన సతీమణి చెవిరెడ్డి లక్ష్మి 1 సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులు రాయపాటి జగదీష్, ఆకుమళ్ళ మల్లికార్జునరెడ్డి వారి నామినేషన్లను దాఖలు చేశారు. యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థి గొట్టిముక్కల సుజాత నామినేషన్ వేశారు. దర్శి అసెంబ్లీ నియోజకవర్గానికి టిడిపి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, బిఎస్‌పి అభ్యర్థి ఇత్తడి శివకుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థి చప్పిడి రవిశంకర్ ▶ 2లో

ప్రచారం చేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి

▶ 5లో

మార్కాపురంలో రాజకీయ రగడ.!

- వైసిపి ప్రచార రథాన్ని అడ్డుకున్న టిడిపి కార్యకర్తలు
- డ్రైవర్‌పైనా దాడి..

వైసిపి వాహనాన్ని అడ్డుకుంటున్న టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల నామినేషన్లు ఇంకా మొదలే కాలేదు.. గొడవలు మాత్రం అప్పుడే మొదలయ్యాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే పోలింగ్ సమయం దగ్గర పడేకొద్దీ ఎలా ఉండబోతోందోనని భయాందోళనలో జనం ఉన్నారు.

మార్కాపురం నియోజకవర్గంలో గతంలో మాదిరిగా ఎన్నికలు సజావుగా జరిగేలా కనిపించడం లేదు. ఎన్‌డిఎ కూటమి గొడవలకు కాలుదువ్వుతున్నట్లుగా తెలుస్తోంది. ఎన్‌డిఎ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తనను గెలిపించకపోతే తన శవాన్ని చూడాల్సి వస్తుందని టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. దీంతో ఆ పార్టీ క్యాడర్ కూడా మరింత రెచ్చిపోతోంది. వచ్చే ఎన్నికల్లో తమకే ▶ 2లో

నీరుగారుతున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

పేదల కోసం ఉద్దేశించబడిన ఉపాధి హామీ చట్టం క్రమేపీ పెత్తందారుల కనుసన్నల్లోకి జారుతోంది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆయా పార్టీల పెత్తందారులు తమ అనుయాయులను క్షేత్ర సహాయకులుగా నియమించుకుంటున్నారు. వారు తమ అనుయాయులకు ఉపాధి పనులు కల్పిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు ఉపాధి భరోసా ఇవ్వాలని ఉద్దేశంతో కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ 2005 ఆగస్టు 25న ఉపాధి హామీ చట్టం తీసుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాలలో వలసలను నివారించాలని, ఆర్థికంగా ఎంతో కొంత చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీలను దృష్టిలో పెట్టుకొని ఈ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించారు. ఈ ఉపాధి హామీ చట్టంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను భాగస్వామ్యం చేస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా క్షేత్రస్థాయి నుంచి ఏపీఓ స్థాయి వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. ఇది ప్రారంభ మొదటి నాళ్లలో కనిపించింది. అప్పట్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల్లో అందరూ ఎస్సీ, ఎస్టీలే కనిపించారు. ఆ తరువాత ఈ ఉపాధి హామీ చట్టంపై అగ్రవర్ణ పెత్తందారుల కన్నుపడింది. కాలక్రమేణా ప్రభుత్వాలు మారినప్పుడల్లా క్షేత్ర సహాయకులను నిర్ణయించే స్థాయికి అధికార పార్టీ నాయకులు చేరుకున్నారు. దీనికి ఉదాహరణగా త్రిపురాంతకం మండలంలోని 24 పంచాయతీలలో 28 మంది క్షేత్ర సహాయకులు ఉండగా అందులో నలుగురు మాత్రమే ఎస్సీలు ఉన్నారు. ఉపాధి హామీని ప్రభుత్వాలు, నాయకులు వారి సొంత ఖజానాగా మార్చుకున్నారు. ఇది తప్పు అని తెలిసినా మండల స్థాయి అధికారుల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ కులంతో నిమిత్తం లేకుండా వారి అనుయాయులకే సిఫారసు చేస్తూ ఉంటే అధికారులు నోరెత్తలేని పరిస్థితి. ఉపాధి హామీ పనులు ఇలానే కొనసాగితే ఈ చట్టం నీరుగారిపోతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి అర్హులైనవారినే క్షేత్ర సహాయకులుగా నియమించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాలవారు కోరుతున్నారు.

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రేమ జంట ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)

వాలంటీర్ జక్కుల గోపి(25) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల వీరి ప్రేమ వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలిసింది. ఇద్దరి కులాలు వేరు కావడంతో యువతి తరపున కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో నాగేశ్వరికి దొనకొండ మండలం ఇండ్లచెరువు గ్రామానికి చెందిన యువకుడితో వివాహానికి కుటుంబ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. పెద్దలు నిశ్చయించిన యువకుడితో పెళ్లి ఇష్టం లేని నాగేశ్వరి శనివారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వచ్చేసింది. గోపికి ఫోన్ చేసి తనకి ఈ పెళ్లి ఇష్టం లేదని, ఇంట్లో నుంచి వచ్చేశానని తెలిపింది. దీంతో గోపి నాగేశ్వరి వద్దకు చేరుకున్నారు. ఎక్కడికైనా వెళ్లి ఇద్దరం పెళ్లి చేసుకుందామని, లేకపోతే ఇద్దరం కలిసి చనిపోదామని భావించారు. పెద్దలను ఎదిరించి కలిసి బతకలేమని నిర్ధారించుకున్న ఈ జంట పురుగులమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇంట్లో నుంచి తమ కుమార్తె వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులు మార్కాపురం గ్రామీణ పోలీస్ స్టేషన్లో గోపిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి.. ప్రేమ జంటను వెతుకుతున్నారు. ఇంతలోనే గ్రామ శివారులోని ఒక తోటలో ఈ జంట విగత జీవులుగా పడి ఉండటాన్ని స్థానికులు గమనించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు, గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం వెంకటేశ్వర నాయక్ ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. గోపి, నాగేశ్వరిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఇద్దరి మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం వెంకటేశ్వర్ నాయక్ తెలిపారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో

మరో జంట బలవన్మరణం

(మొదటిపేజీ తరువాయి)

వివాహమైంది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న పోలిరెడ్డి దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో విజయలక్ష్మికి అదే గ్రామానికి చెందిన పోతిరెడ్డి సత్యనారాయణరెడ్డి(30)తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలిసి ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు, గ్రామస్తులు విజయలక్ష్మిని, సత్యనారాయణరెడ్డిని మందలించారు. పద్ధతి మార్చుకోవాలని సూచించారు. పెద్దల మాటలను పెడచెవిన పెట్టిన ఇద్దరూ వివాహేతర సంబంధాన్ని ఎప్పటిలాగే కొనసాగిస్తున్నారు. దీంతో గత వారం రోజుల నుంచి విజయలక్ష్మి ఇంట్లో గొడవలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కుటుంబ సభ్యులు పెద్దారవీడు పోలీస్‌స్టేషన్‌లో కనపడటం లేదని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తిరుపతిలో ఉంటున్న విజయలక్ష్మి ప్రియుడు సత్యనారాయణ రెడ్డి పుచ్చకాయలపల్లి గ్రామానికి వచ్చి విజయలక్ష్మి తన వద్ద లేదని, ఎక్కడికెళ్లిందో తనకు కూడా తెలియదంటూ మృతురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తులకు తెలిపాడు. శనివారం తెల్లారేసరికల్లా చింతకుంట్ల గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఈ జంట ఆత్మహత్యకు పాల్పడ్డారు. అటువైపుగా పొలానికి వెళ్లే రైతులు వీళ్ల మిగతా జీవులుగా పడి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. తమ వివాహేతర సంబంధానికి కుటుంబ సభ్యులు అడ్డుపడుతున్నారనే ఈ జంట ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. తమ బాగోగులు చూసుకోవలసిన తల్లి ఇలా ఆత్మహత్యకు పాల్పడంతో మృతురాలు విజయలక్ష్మి కుమార్తె, కుమారుడు రోదిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది. చేతికి అందివచ్చిన కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో తమకు దిక్కెవరంటూ మృతుడు సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఈ మేరకు మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు.

24న తాటిపర్తి చంద్రశేఖర్ నామినేషన్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈ నెల 24వ తేదీన నామినేషన్ వేయనున్నట్లు తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా పార్టీ నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. ఈ నామినేషన్ సందర్భంగా యర్రగొండపాలెంలోని వైసీపీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ ఉంటుందని చెప్పారు. ర్యాలీకి యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపిటీసీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు, వార్డు మెంబర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఊపందుకున్న నామినేషన్ల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

నామినేషన్ వేశారు. కొండపి అసెంబ్లీ నియోజకవర్గానికి వైసిపి అభ్యర్థి ఆదిమూలపు సురేష్, పిరమిడ్ పార్టీ అభ్యర్థి మెండ బాలకోటయ్య, బిఎస్‌పి అభ్యర్థి రావినూతల మాణిక్, స్వతంత్ర అభ్యర్థి మామిడి మాల్యాద్రి వారి నామినేషన్లను దాఖలు చేశారు. గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి బాలసాని మాల్యాద్రి రెడ్డి, కొప్పోలు నరసింహులు వారి నామినేషన్లను దాఖలు చేశారు. సంతనూతలపాడు, కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. ఆదివారం నామినేషన్ల స్వీకరణకు సెలవు కావటంతో సోమవారం నుంచి నామినేషన్ల దాఖలు ప్రక్రియ మరింత వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

మార్కాపురంలో రాజకీయ రగడ.!

(మొదటిపేజీ తరువాయి)

ఒట్టేయాలనే హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సామాన్యులు కొంత భయంతో ఉన్నారు. స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునే పరిస్థితి ఉండదేమోనని కొందరు ఆందోళన చెందుతున్నారు.

ఈ క్రమంలోనే వైసిపి ప్రచార రథాలను అడ్డుకోవడం, అక్కడక్కడా దాడులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజుల క్రితం ఓ వాలంటీర్‌పై దాడి జరిగింది. తాజాగా శుక్రవారం రాత్రి మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వైసిపి ప్రచార రథం తిరుగుతుండగా టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆ వాహనం డ్రైవర్‌గా ఉన్న అంజిపైనా దాడి చేసినట్లు తెలిసింది. దీంతో పాటు మార్కాపురం మండలంలోని మాల్యవంతునిపాడు గ్రామంలోనూ వైసిపికి చెందిన అన్నా వెంకట రాంబాబు ప్రచార రథాన్ని అడ్డుకున్నారు. వైసిపి ప్రచార వాహన డ్రైవర్ అంజి తనపై దాడి చేసినట్లు మార్కాపురం పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వైసిపి నేతలు ఈ దాడులను సీరియస్‌గా తీసుకున్నారు. ఎన్నికల కమిషన్‌తో పాటు జిల్లా ఎస్పీ సుమిత్ సునీల్‌కు ఫిర్యాదు చేశారు. దాడికి సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిసింది. బాధితుడు అంజి ఫిర్యాదు మేరకు మార్కాపురం పట్టణ ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్ కేసు దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన చిట్యాల శేఖరరెడ్డి, డి.హనుమాన్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

సురేష్‌కు బి.ఫారం అందజేత

ప్రజాశక్తి-కొండపి

వైసిపి కొండపి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శనివారం బిఫారం అందజేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో డాక్టర్ సురేష్ చెవిరెడ్డి నుంచి బిఫారం అందుకున్నారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న వైసిపి కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ ఆదిమూలపు సురేష్ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బి.ఫారం పత్రాన్ని ఆదిమూలపు సురేష్‌కు అందచేస్తున్న ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

మహారాజశ్రీ 6వ అదనపు జిల్లా జడ్జి : మార్కాపురం
I.A.No. 232/2020 In
A.S.No. 28/2020

Between:
అంగం చిన్న వెంకటేశ్వర్లు (Died) మరియు ఇతరులు ...పిటిషనర్ / అప్పీలెంటు
And
అంగం పెద్ద వెంకటేశ్వర్లు (Died) మరియు ఇతరులు ...రెస్పాండెంటు / రెస్పాండెంటు
To,
(R4) అంగం కొండాస్వామి తండ్రి లేటు పెద్ద వెంకటేశ్వర్లు, ప్రైవేటు ఉద్యోగి, నివాసము గణేష్ నగర్, గిద్దలూరు టౌన్ మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు అప్పీలు రెస్పాండెంట్ల మీద అప్పీలెంటు అప్పీలు దాఖలు చేసియున్నారు. అదే విధంగా I.A.No. 232/2020 డిక్రీ ప్రొసీడింగ్స్ స్టే చేయమని పిటీషన్ దాఖలు చేసి యున్నారు. I.A.నెం. 232/2020లో మరియు A.S.No. 28/2020 లో మీరు 4వ రెస్పాండెంటు అయివున్నారు. మీకు నోటీసు చేరని కారణంగా కోర్టు వారు పేపర్ ప్రకటన ద్వారా అప్పీలు నెంబర్ 28/2020 మరియు I.A.No. 232/2020 నోటీసు జారి చేయమని ఆర్డర్ చేసియున్నారు. కావున మీరు ది. 30.04.2024 ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల పరోక్షమందు దావా తీర్మానించబడునని తెలియ పరచడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
నాగిశెట్టి మోహన్‌దాస్
వినోద్ కాంత్
అడ్వకేట్

జనరల్ నోటీసు
మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
G.W.O.P 5/2024

సాదు ఆరాధ్య, సాధు భవనీలు మైనర్లు అయినందున గార్డియన్ గా నాయనమ్మ సాదు రత్తాయమ్మ ... పిటిషనర్
వర్సెస్
అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమీషనర్, (అకౌంట్స్) ప్రావిడెంట్ ఫండ్ కమీషనర్ రీజనల్ ఆఫీసు మూడో లైన్ కృష్ణ నగర్ గుంటూరు పిన్ 522006, Ap ...రెస్పాండెంట్

లేటు సాదు జనార్ధన రావు గారు పి.డి.సి.సి బ్యాంకు ఒంగోలు ఏటిఎం వాహనం డ్రైవర్ గా పనిచేయుచు మరణించినందున వారి తాలూకు ప్రావిడెంట్ ఫండ్ మొత్తమును మైనర్లు అయిన సాదు ఆరాధ్య, సాదు భవనీలు, పొందుట కొరకు తల్లి అయిన సాదు ప్రియాంక కూడా మరణించినందున వారి గార్డియన్ గా వారి నాయనమ్మ అయినా సాదు రత్తాయమ్మ నియమించు లాగు పై నెంబర్ న పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు పై తెలిపిన సాదు రత్తయమ్మగారు గార్డియన్ గా ఉండుట కొరకు ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్నను మీరు తేది 26.04-2024 న ఉదయం 10:30 కి పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసియున్నది లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఇట్లు
లింగాల కోటేశ్వరరావు
న్యాయవాది జిల్లా ఎదురు
ఒంగోలు.

చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-దర్శి

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం టిడిపి దర్శి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్రానికి దిక్సూచి లాంటి వ్యక్తి అని తెలిపారు. అమరావతి రాజధాని కోసం రైతులు భూములు ఇస్తే మూడు రాజధానుల పేరుతో సిఎం జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు శోభారాణి, సంగా తిరుపతిరావు, దారం సుబ్బారావు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తాళ్లూరులోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబులరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మానం రమేష్, శాగం కొండారెడ్డి, గొర్రెపాటి వేణు, బొడ్డు హనుమారెడ్డి, మేడగం వెంకటేశ్వర్‌రెడ్డి, కైపు రామకోటిరెడ్డి, రాచకొండ వెంకట్రావు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దర్శిలో కేక్ కట్ చేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

మాగుంట రాఘవరెడ్డికి కేక్ తినిపిస్తున్న డాక్టర్ ఉగ్ర

యర్రగొండపాలెం : టిడిపి అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు, టిడిపి మండల కన్వీనర్లు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాద్, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, గోళ్ల సుబ్బారావు, కామేపల్లి వెంకటేశ్వర్లు, వేగినాటి శ్రీనివాస్, చీదెళ్ల నాగేశ్వరరావు, బివి సుబ్బారెడ్డి, షేక్ మస్తాన్‌వలి, షేక్ వలి, షేక్ ఇస్మాయిల్, చేదూరి కిశోర్, భాస్కర్ పాల్గొన్నారు.

గిద్దలూరు : టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను టిడిపి గిద్దలూరు నియోజక వర్గ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి కేక్ కట్ చేసి టిడిపి నాయకులకు, కార్యకర్తలకు పంచారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి బుడతా మధుసూదన్ యాదవ్, నాయకులు కుప్పా రంగసాయి, కటికే యోగానంద్, కమతం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు : టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎన్.విజయకుమార్, నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు , టిడిపి రాష్ట్ర సెక్రెటరీ అడక స్వాములు, టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ,తేళ్ళ మనోజ్ కుమార్ , మండవ జయంత్ బాబు , నాయకులు యడ్లపల్లి రాంబ్రహ్మం , మండవ గోపి, నరసింహా రావు , ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కంకణాల గోపికష్ణ , టిఎన్ఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాసరావు ,ఉపేంద్ర , గోపి పాల్గొన్నారు.

మద్దిపాడు : టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కడియాల రఘుబాబు, మండవ గోపీచంద్, రావి నరసింహారావు, చుంచు హరిబాబు, నవులూరి శివకష్ణ ,వేల్పుల నాగరాజు, ముళ్ళూరి మురళి, దాట్ల వేణుగోపాల్ రాజు, భానుచందర్, అరగుల్లు వెంకయ్య, సుద్దపల్లి అనిల్, పోలిశెట్టి అంజి బాబు, ఎరగర్ల చైతన్య, బాపట్ల వెంకటేశ్వర్లు, చెరుకూరి వాసు, గడ్డం రవి తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి : మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయుడు మాగుంట రాఘవ రెడ్డి ,జయసింహా రెడ్డి, కార్యకర్తల అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, నంబుల వెంకటేశ్వర్లు, షేక్ ఫిరోజ్ , షేక్ అహ్మద్ ,కాటం అరుణమ్మ, పార్వతి, షేక్ వాజీద, షేక్ కరీమున్నీ సా పాల్గొన్నారు.

మంత్రి సురేష్ తరపున నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-కొండపి

వైసిపి కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తరపున కసుమర్తి పున్నారావు శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఆర్‌ఒ కుమార్‌కు పునార్నావు ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. అదేవిధంగా ఫిరమిడ్ పార్టీ తరుపున మెండా బాలకోటయ్య ఒక సెట్, బిఎస్‌పి తరుపున రావినూతల మాత్రిక ఒకసెట్, స్వతంత్ర అభ్యర్థిగా మామిడి మాల్యాద్రి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కొండపి నియోజక వర్గంలో శనివారం మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలు అయినట్లు ఆర్‌ఒ కుమార్ తెలిపారు.

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నాయకులు

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని వెన్నూరు, చినవెంకన్నపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పాలేటి వెంకటస్వామి శనివారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకట స్వామి మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉదయాన్నే వచ్చి కొలతలు ప్రకారం పనులు చేసుకోవాలన్నారు. రోజువారీ కూలీ రూ.300 వచ్చే విధంగా పనులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసి ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న వెంకటస్వామి

రోడ్డు ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మద్దిపాడు

రోడ్డు ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని గుండ్లపల్లి ఎంపిటిసి పద్మకుమారి కోరారు. ఈ మేరకు ఇఒఆర్‌డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పద్మకుమారి మాట్లాడుతూ గుండ్లపల్లి గ్రామంలో గాంధీ బొమ్మ నుంచి కారుమూడివారిపాలెం వెళ్లే సిసి రోడ్డును గుత్తికొండ శ్రీనివాసరావు ఆక్రమించి అక్రమంగా భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీంతో స్కూల్ బస్సులు తిరిగేందుకు, దేవుని ఊరేగింపు కార్యక్రమానికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. గతంలో ఇదే విషయమై పలుమార్లు ఫిర్యాదు చేయగా అక్రమంగా భవన నిర్మాణం ఆపినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులు పట్టించుకోరని గ్రామస్తులను వ్యతిరేకించి అక్రమ నిర్మాణం చేపట్టినట్లు తలెఇపారు. అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వార్డు మెంబరు సురేష్ బాబు, శ్యామ్ సుందర్ రెడ్డి, అనిల్ కుమార్, బ్రహ్మయ్య, సాంబశివరావు, రంగారావు, వెంకట్రావు, శ్రీనివాసులు, సురేష్ బాబు, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

వినతి ప్రతం అందజేస్తున్న ఎంపిటిసి, గ్రామస్తులు

వికలాంగుల సంక్షేమానికి కృషి : దామచర్ల

ప్రజాశక్తి-కొత్తపట్నం

వికలాంగుల సంక్షేమానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేసినట్లు ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. వికలాంగుల పరిచయ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలో 280 మంది వికలాంగులకు ఒకే చోట ఇంటి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. వికలాంగులకు ఇంటి పట్టాలు ఇచ్చిన ఘనత టిడిపికే దక్కుతుందని తెలిపారు. వికలాంగులకు పట్టాలు ఇచ్చిన భూముల నుంచి మోటుమాలకు చెందిన ట్రాక్టర్ యాజ మానులు ఇసుక తరలిస్తున్నట్లు జనార్ధన్ దష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన జనార్ధన్ మాట్లాడుతూ వికలాంగులకు ఇచ్చిన పట్టా భూముల నుంచి ఇసుక తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వికలాంగులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాం గుల సమైక్య నాయకులు నాంచార్లు, కాంతారావు, లక్ష్మీ నారాయణ, శివయ్య, శ్రీను. టిడిపి నాయకులుద్వారపాకుల శ్రీనివాసరావు, నాళం నరసమ్మ ,సింగిరి శ్రీను ,గేనం సుబ్బారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల

వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ రంగనాథ్

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ ఆధ్వర్యంలో టంగుటూరులోని టోల్ ప్లాజా వద్ద శనివారం మెటారు బైకుల తనిఖీ నిర్వహించారు. ఇటీవల కాలంలో వాహనదారులు సైలెన్సర్స్‌ను మార్చి ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా సౌండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మోటారు బైకుల తనిఖీ నిర్వహిచారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహన దారులు రకరకాల శబ్ధాలతో ప్రజలను ఇబ్బందికి గురిచేస్తే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సబంధించిన అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మద్యం బాటిళ్లు స్వాధీనం

చీరాల : అక్రమంగా మద్యం బాటిళ్లు రవాణా చేస్తున్న ఓ ముఠా గుట్టును వన్‌టౌన్ సిఐ శేషగిరిరావు రట్టు చేశారు. వారి వద్ద నుంచి 200 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శనివారం రాత్రి చీరాల పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జాండ్రపేటకు చెందిన సలగల జాన్సన్, డక్కుమల్లి కళ్యాణ్ బాబు అనే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై యథేచ్ఛగా 200 క్వార్టర్ మద్యం బాటిళ్లను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న సిఐ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 200 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా చట్టాన్ని అతిక్రమించినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది సుబ్బారావు, పి. కృష్ణ, పరమేశు, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

మద్దిపాడు : మండల పరిధిలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో కిలో పొగాకు అత్యధిక ధర రూ.265 పలికినట్లు వేలం కేంద్రం సూపరిండెంటెంట్ రామకష్ణ తెలిపారు. వేలం కేంద్రానికి మొత్తం 477 పొగాకు బేళ్లు అమ్మకానికి రాగా అందులో 412 బేళ్లు అమ్ముడు పోయినట్లు తెలిపారు. వివిధ కారణాల చేత 63 బేళ్ల తిరస్కరించినట్లు పేర్కొన్నారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.265, అత్యల్ప ధర రూ.220, సరాసరి ధర 232.65 పైసలు పలికినట్లు ఆయన తెలిపారు.

కొండపి : కొండపి వేలం కేంద్రానికి నర్సింగోలు, కట్టావారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1,067 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 842 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 225 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.260, అత్యల్ప ధర రూ.220, సరాసరి ధర రూ.231.35 పైసలు పలికింది.

సార్వత్రిక సమరం

ఎంఎల్ఎ ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నటిడిపి బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు నిబద్ధతకు వైసీపీ శ్రేణులు అధికారపార్టీని వీడి టిడిపి తీర్థం పుచ్చుకుంటున్నట్లు తెలిపారు. ఎంఎల్ఎ ఏలూరి సమక్షంలో టిడిపిలో చేరేందుకు ఉత్సాహం చూపారు. పార్టీలకు అతీతంగా ఎంఎల్ఎ ఏలూరి చేయించిన అభివృద్ధి పనులు, మచ్చలేని నాయకత్వం, అమలు చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై ఆయన వెంట నడిచేందుకు వచ్చినట్లు తెలిపారు. వైసీపీ సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు వైసిపిని వీడి టిడిపిలో చేరుతుండడంతో వైసిపి నాయకులు బెంబేలెత్తిపోతున్నారని టిడిపి నేతలు చెబుతున్నారు. వైసిపి నుండి టిడిపిలో చేరిన వారిని ఎంఎల్ఎ ఏలూరి ఆప్యాయంగా పలకరించారు. తానున్నానని బరోసా ఇచ్చారు. బొబ్బేపల్లి మాజీ సర్పంచ్ పెంట్యాల రామారావు, మాజీ ఎంపీటీసీ దుడ్డు దానయ్య ఆధ్వర్యంలో 200కుటుంబాలు టిడిపిలో చేరారు. దుడ్డు బాలు, ఐమాల సుబ్బారావు, దొడ్డ రామకృష్ణ, దొడ్డ శ్రీహరిరావు, దొడ్డ శ్రీను, గంగ శేషగిరి, దైత ప్రతాప్, పుల్లగోర కిషోర్, తైదల వెంకట్రావు, పుల్లగోర శేషయ్య, బత్తుల సూరిబాబు, పారి దేవదానం, మాలెంపాటి మల్లయ్య, గడ్డం శేషయ్య టిడిపిలో చేరారు. మార్టూరు రాంనగర్, నేతాజీ నగర్‌కు చెందిన 50కుటుంబాలకు చెందిన చెరుకూరి అంజయ్య, నాగండ్ల శ్రీను, నాగండ్ల జనార్ధన్, నాగండ్ల మురళి, మందపాటి పుల్లారావు, మందపాటి వీరాంజనేయులు, నాగండ్ల దుర్గ, నాగండ్ల నాగరాజు టిడిపిలో చేరారు. ఇంకొల్లుకు చెందిన షేక్ ఫాజియా, షేక్ జుబేదా, షేక్ కరిమ్మ, షేక్ దారియాబి, పసుపులేటి నాగేశ్వరమ్మ, పసుపులేటి శారద, కమ్మిశెట్టి ధనమ్మ, షేక్ మోతి, పసుపులేటి కోటమ్మ, షేక్ షాహేనా టిడిపిలో చేరారు. కార్యక్రమంలో దేవరపల్లి గురవయ్య, వంకాయలపాటి కృష్ణుడు, వినుకొండ నాగరాజు, జాగర్లమూడి వీరాంజనేయులు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కుంభ సాంబశివరావు, కుంభ నాగేశ్వరరావు, చెప్పవరపు శ్రీను, గోగులమూడి బాబు, గోగులమూడి సామేలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ఎన్నికల కార్యాలయం ప్రారంభిస్తున్న ఏలూరి

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరం గ్రామంలో ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు శనివారం టిడిపి కార్యాలయం ప్రారంభించారు. గ్రామంలో గతంలో టిడిపికి 317ఓట్లు మెజార్టీ వచ్చిందని, ఈ సారి 400 ఓట్ల మెజార్టీ తీసుకు రావాలని కోరారు. అనంతరం మాజీ సర్పంచ్ పెడవల్లి కామేశ్వరరావును పరామర్శించారు. రావిపాటి సీతయ్య, గుదే తారక, వెంకట్రావు, రవీంద్ర, బాజీ, శేఖర్, హనుమంతరావు, సునీల్, రామకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో ప్రజాప్రతినిధులు

అశోక్ బాబుకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి వరికూటి అశోక్ బాబు గెలుపు కోరుతూ మండలంలోని పెద్దపులివరు గ్రామంలో ఎంపీపీ డిబి లలిత కుమారి, జడ్పిటిసి టి ఉదయభస్కరి ఆధ్వర్యంలో గడప గడపకు తిరిగి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని సిఎంగా గెలిపించుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఎంఎల్ఎగా వరికూటి అశోక్ బాబు, బాపట్ల ఎంపిగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ జంపాని మునిలక్ష్మి, నాయకులు మల్లేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న వేగేశన హరి కుమారి

నాలుగు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల అసెంబ్లీకి నాలుగు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల అధికారి చామకూరి శ్రీధర్ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థి ఉప్పాల మురళి, కొచ్చర వినయ్ రాజు, టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సతీమణి వేగేశన హరి కుమారి 2సెట్లు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు.

పర్చూరు : అసెంబ్లీ ఎన్నికలకు 3వరోజు శనివారం ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదని సహాయ రిటర్నింగ్ అధికారి, తహసిల్దార్ పి సుబ్బయ్య తెలిపారు.

22న హనిమిరెడ్డి నామినేషన్

ప్రజాశక్తి - అద్దంకి

వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా పానెం చిన్న హనిమిరెడ్డి ఈ నెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలోని ఐదు మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

హనిమిరెడ్డి

టిడిపితోనే బీసీల అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - బాపట్ల

టిడిపితోనే బీసీల అభివృద్ధి సాధ్యమని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులతో వేగేశన ఫౌండేషన్ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు సంక్షోభంలో కూరుకుపోయాయని అన్నారు. టిడిపి అధికారానికి వస్తేనే బీసీ సంక్షేమం మెరుగు పడుతుందని అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతి కుమార్, కొల్లూరి హనుమంతరావు, బాపట్ల రవికుమార్, ఎన్ఎస్పి రాజు, మారం రవికుమార్, నటరాజన్, కంకణాల బాలమ్మ, ఉప్పలదిన్నె గోపీనాథ్, మారం భాను, హరిబాబు, పున్నారావు, పద్మ, చంద్రకళ, పాపమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరేంద్ర వర్మ

22న ఏలూరి నామినేషన్

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ఈ నెల 22న పర్చూరు ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు టిడిపి బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ శనివారం తెలిపారు. ఇసుక దర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయం నుండి ర్యాలీగా బయలు దేరి పర్చూరు తహశీల్దారు కార్యాలయానికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమానికి టిడిపి, ప్రజాసేన, బిజెపి కూటమి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఎంఎల్ఎ ఏలూరి

సమన్వయంతో పనిచేయండి

ప్రజాశక్తి - కొల్లూరు

స్థానిక ఎంప్లాయ్ రిక్రియేషన్ క్లబ్బులో శనివారం జరిగిన టిడిపి, జనసేన నాయకుల సమన్వయ సమావేశంలో టిడిపి అభ్యర్థి నక్కా ఆనందబాబు మాట్లాడారు. ఈనెల 22న తన నామినేషన్ ఏర్పాట్లను నాయకులతో చర్చించారు. అధినాయకుడు చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మచ్చలేని నాయకుడు చంద్రబాబు అన్నారు. అలాంటి వ్యక్తిపై మచ్చ వేసేలా జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నించాడని ఆరోపించారు. అలాంటి సమయములో తోడుగా నిలబడిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన అభ్యర్థుల కూటమిని గెలిపించి చంద్రబాబుకు జన్మదిన గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి ఉషా రాజేష్, టిడిపి మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కనగాల మధుసూధన ప్రసాద్, జనసేన మండల అధ్యక్షులు చలమయ్య పాల్గొన్నారు.

ఆనందబాబు ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం

యువత భవిష్యత్తు టిడిపితోనే..

ప్రజాశక్తి - అద్దంకి

యువత భవిష్యత్తుకు టిడిపిని గెలిపించాలని ఉమ్మడి కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ కోరారు. మండలంలోని ఉప్పలపాడులో ఎన్నికల ప్రచారం శనివారం నిర్వహించారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సంతమాగులూరు : మండలంలోని తంగేడుమల్లిలో ఉమ్మడి కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ ఇంటింటికి ప్రచారం చేశారు.

నూతన ఓటర్లతో ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్

కాంగ్రెస్ అభ్యర్థి అడుసుమల్లి నామినేషన్

ప్రజాశక్తి - అద్దంకి

కాంగ్రెస్, పిరమిడ్, బిఎస్‌పి పార్టీల ఎంఎల్ఎ అభ్యర్థులైన అడుసుమల్లి కిషోర్ బాబు, గుమ్మా సదాశివరావు, మంద జోసెఫ్ స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునీల్ కుమార్‌కు తమ నామినేషన్ పత్రాలు శనివారం అందజేశారు. టిడిపి, కాంగ్రెస్, పిరమిడ్, బిఎస్పిలకు చెందిన అభ్యర్థులు శనివారం సాయంత్రం లోపు నామినేషన్ పత్రాలు అందజేశారు.

కాంగ్రెస్ అడుసుమల్లి కిషోర్‌బాబు నామినేషన్

ఉప్పూడి ఎంపీటీసీ సతీష్ జనసేనలో చేరిక

ప్రజాశక్తి - రేపల్లె

ఉప్పూడి ఎంపీటీసీ అల్లంశెట్టి సతీష్ బాబు వైసీపీని వీడి జనసేన కండువా కప్పుకున్నారు. ఆయనతోపాటు అరవపల్లె ఉప సర్పంచ్ భూపతి బాలకృష్ణ జనసేనలో చేరారు. వీరిద్దరకీ జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ ఛైర్మన్ జనసేన జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి జనసేనలో చేరిన ఉప్పూడి ఎంపీటీసీ, అరవపల్లె ఉప సర్పంచ్‌ని అభినందించారు. దశాబ్ద కాలంగా వైసీపీ కోసం పనిచేసిన అల్లంశెట్టి సతీష్ బాబు కుటుంబ సభ్యులపై సొంత పార్టీ నేతలే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయటాన్ని ఆయన ఖండించారు. గ్రామ అభివృద్ధి కోసం మాట్లాడినందుకు అతని కుటుంబ సభ్యులపై అట్రాసిటీ కేసులు పెట్టడం అన్యాయమని అన్నారు. టిడిపి ఉమ్మడి అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ గెలుపు కోసం జనసైనికులు కృషి చేయాలని కోరారు.

జనసేనలో చేరిన ఎంపిటిసి అల్లంశెట్టి సతీష్

సార్వత్రిక సమరం

పేదల సంక్షేమమే ధ్యేయం : కరణం

ప్రజాశక్తి-చీరాల

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైసిపి చీరాల నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్ తెలిపారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలో నెహ్రూ కూరగాయల మార్కెట్ మరియు ఫ్రూట్ మార్కెట్‌ల్లో వైసిపి బాపట్ల పార్లమెంట్ అభ్యర్థి నందిగం సురేష్ సోదరుడు సోదరుడు నందిగం వెంకట్‌తో కలసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు, మహిళలను కలసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ప్రజా సంకల్ప పాదయాత్ర సందర్భంగా ప్రజల ఇబ్బందులను కల్లారా చూసిన జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పేదల అభ్యున్నతి కోసం నవరత్నాల పథకాలు అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కరోనా ప్రభావంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్నా పేదల సంక్షేమం కోసం పథకాలు అమలు చేసిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దక్కుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో చీరాల ఎమ్మెల్యేగా తనను, బాపట్ల పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధ్యక్షుడు కొండ్రు బాబ్జీ, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు,వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు, వాసిమల్ల బ్రదర్స్, బొనిగల అమతరావు, కలవకూరి యానాదిరావు, క్లస్టర్-2 యువత అధ్యక్షుడు రమేష్, గోలి జగదీష్, సేవదళ్ సెక్రటరీ గోలి గంగాధర్, మల్లెల లలిత రాజశేఖర్, జనరల్ సెక్రటరీ చిలుకోటి శ్రీనివాసరావు, తలకాయల సుధీర్, కోడూరి ప్రసాద్‌రెడ్డి, జంగా ప్రేమ్‌కుమార్, కట్టా చంద్ర, పిడతల అభిషేక్, కొండ్రు ప్రతాప్, తొట్టెంపూడి ఇనయ్య, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న కరణం వెంకటేష్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి దర్శి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని టిడిపి దర్శి నియోజక అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దర్శి నగర పంచాయతీ లోని 15వ వార్డులో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే టిడిపితోనే సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్ తలారి కోటయ్య, స్టీవెన్, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు శోభా రాణి, దారం సుబ్బారావు,. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మి తరపున నామినేషన్ దాఖలు

ప్రజాశక్తి-దర్శి

టిడిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి తరపున న్యాయవాది వీరపనేని రంగ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి లోకేశ్వర రావుకు నామినేషన్ పత్రాలు అందించారు. బహుజన సమాజ్ పార్టీ తరపున ఇత్తడి శివప్రసాద్ నామినేషన్ దాఖలు చేశారు. దర్శి నియోజక వర్గంలో ఇప్పటి వరకూ 10 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్ఓ లోకేశ్వరరావు తెలిపారు.

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న న్యాయవాది

పరిచయ కార్యక్రమంలో మంత్రి సురేష్

బాలయోగి నగర్‌ను అభివృద్ధి చేస్తా ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలయోగి నగర్‌ను అభివృద్ధి చేస్తామని వైసిపి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. బాలయోగి నగర్‌లో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి స్వగృహంలో మంత్రి పరిచయ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తనను ఆదరిస్తే బాలయోగినగర్‌ను అన్ని విధాలుగా తీర్చి దిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు, వార్డు సభ్యులు గంజి సుబ్బారావు, చొప్పర వెంకన్న, ల్యాబ్ ప్రసాదు, మిడసల జేసీపాల్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి మాజీ సర్పంచు చుక్కా కిరణ్ కుమార్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో మాగుంట, కందుల

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కొనకనమిట్ల

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో పలువురు శనివారం టిడిపిలో చేరారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కందుల నారాయణ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఉపాధ్యక్షులు, రైతు సంఘం నాయకులు తిరుపతిరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే బాలినేని

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు 50వ డివిజన్ నెహ్రూ కాలనీకి చెందిన టిడిపి, జనసేన పార్టీ నాయకులు షేక్ సుభాని అతని, అనుచరులు శనివారం వైసిపిలో చేరారు. వైసిపి నాయకుడు మారెడ్డి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వైసిపి పాలనలో ఏమి చేశారో చెప్పాలి : స్వామి

శింగరాయకొండ : కొండపి నియోజకవర్గంలో టిడిపి హయాంలోనే అభివద్ధి జరిగిందని, వైసిపి ఐదేళ్ల పాలనలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని టిడిపి కొండపి నియోజక వర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. కొండపి నియోజకవర్గం మర్రిపూడి మండల పరిధిలోని శివరాయునిపాలెం, కాకర్ల గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కొండపి నియోజకవర్గాన్ని టిడిపి హయాంలో అప్పటి ఎమ్మెల్యే దామచర్ల ఆంజనేయులు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత తన హయాంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. టిడిపి హయాంలో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసారెడ్డి, యర్రమోతు శ్రీనివాసరావు, నరసింహ, బోయపాటి కష్ణారెడ్డి, సూరసాని కృష్ణారెడ్డి, చెరుకూరి నాగేశ్వరరావు,ప్రసాదు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి

వైసిపితోనే అందరికీ సమన్యాయం

వైసిపి దర్శి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-దర్శి

వైసిపితోనే బలహీన, బడుగు మైనార్టీ వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని వైసిపి దర్శి నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పొతకమూరు పంచాయతీలో పరిధిలోని పొతకమూరుచెరువు, కొమ్ముపాలెం, పాపిరెడ్డిపాలెంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే మళ్లీ జగన్‌మెహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తనను, వైసిపి ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు వైసిపిలో చేరారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సర్పంచులు బొట్ల వెంకయ్య, ముచ్చుమూరి వెంకట్‌రెడ్డి, ఎంపిటిసి, వైస్ ఎంపిపి సోము దుర్గారెడ్డి, మాజీ సర్పంచి వెన్నపూస నాగిరెడ్డి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు కుమ్మితంగిరెడ్డి, డాక్టర్ ఎస్ఎం.బాషా, మాజీ సర్పంచి జైనుల్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దొనకొండ : పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. దొనకొండలోని బ్రహ్మారావుపేట, ఆర్యవైశ్య బజారు, పెద్దమసీదు బజారులో వైసిపి దర్శి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి మద్దతుగా బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి సతీమణి నందిని శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కుమారుడు శివప్రసాద్‌రెడ్డికి, వైసిపి ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉషా మురళి, వైసిపి మండల అధ్యక్షుడు కాకల కష్ణారెడ్డి, మాజీ జడ్‌పిటిసి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, దొనకొండ ఉపసర్పంచి ఇమ్రాన్‌ఖాన్, ఎంపిటిసి అమ్మాజీ తదితరులు పాల్గన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సురేష్

వైసిపితోనే గ్రామాల అభివృద్ధి : మంత్రి

ప్రజాశక్తి-శింగరాయకొండ

వైసిపితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని వైసిపి కొండపి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. టంగుటూరు పంచాయతీ పరిధిలోని పోతల చెంచయ్య వెస్ట్ కాలనీలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి కి అందరూ అండగా నిలవాలన్నారు. మహిళల అభివృద్ధి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీరు లేక.. గొంతు తడవక..

- ముందుకు సాగని జలజీవన్ పథకం పనులు
- పందిళ్లపల్లిలో నీటి కష్టాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

అందుబాటులో ఉన్న నీటివనరులను వినియోగించు కోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంటుంది. ఫలితంగా నీటి కోసం ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మండల పరిధిలోని పుల్లగూరపల్లి, పందిళ్ళపల్లి గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. జల జీవన్ మిషన్ పథకం కింద మంజూరైన ఇంటింటికీ నీటి కొళాయి పథకం పనులు పూర్తి కాలేదు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు పూర్తి కాలేదు. పందిళ్ళపల్లి గ్రామంలో రామాలయం వద్ద ఓ బోరింగ్ ఉంది. గ్రామానికి వెలుపల బోర్ ఉంది. అక్కడే మినీ ట్యాంకు ఉంది. ఊరు వెలుపల ఉన్న మినీ ట్యాంకు వద్ద నుంచి గ్రామస్తులు నీరు తెచ్చుకుంటున్నారు. విద్యుత్ సరఫరా లేనప్పుడు రామాలయం వద్ద ఉన్న బోరు నుంచి నీరు తెచ్చుకునేవారు. అయితే ఈ మర్మతులకు గురైంది. అయినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యుత్ సరఫరా లేనప్పుడు వ్యవసాయ పొలాలలోని దిగుడు బావుల వద్ద నుంచి ప్రజలు నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. దీంతో అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో జల జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలో ఇంటింటికి కొళాయి మంజూరు చేశారు. ఈ పథకం కింద ప్రత్యేకంగా బోరు వేసి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి పైపుల ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు పూర్తి కాలేదు. రెండు బోర్లు వేశారు, ఇంటింటికి పైపులైను వేశారు కానీ ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించ లేదు. బోర్ నుంచి పైప్‌లైన్ కు కలెక్షన్ ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జలజీవన్ మిషన్ పథకం పనులను పూర్తి చేయించి నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిరుపయోగం మారిన బోరు

మరమ్మతులకు గురైన బోరు

సగం పనులే చేశారు

పాపయ్య, పందిళ్ళపల్లి

ఇంటింటికీ నీటి కుళాయి ఏర్పాటు చేస్తామని పైప్ లైన్లు ఏర్పాటు చేశారు. బోర్లు కూడా వేశారు. బోర్ల నుంచి పైప్ లైన్లకు కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ట్యాంకు నిర్మాణం కోసం 10 సెంట్ల స్థలం ఇచ్చా. అయినప్పటికీ ట్యాంకు నిర్మించడం లేదు. ఫలితంగా ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు.

నీటి కోసం ఇక్కట్లు

పందిళ్ల వెంకటమ్మ

నీటి కోసం అవస్థలు పడుతున్నాం. ఊరు చివరికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. దీంతో అనేక ఇబ్బందులు

పడుతున్నాం. కరెంటు లేక పోతే దిగుడు బావిలోకి దిగి నీరు తెచ్చుకోవాల్సి వస్తుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదానికి గురికావాల్సి వస్తుందోనని భయంగా ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి జలజీవన్ పనులు పూర్తి చేసి కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలి.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఓటు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో స్వీప్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఓటు హక్కు,ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ,విద్యార్థులకు ఎడ్యుకేషన్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం మహమ్మ దాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం రావాలని ఆకాంక్షిస్తూ ఓటు హక్కు కలిగి ఉన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధువులు ఓటు హక్కును వినియోగించే విధంగా ప్రోత్సహిస్తామని చెబుతూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రమణయ్య, విఆర్‌ఒ సుబ్బయ్య, బిఎల్‌ఒలు వెంకట రాజు,ఎం.రామ్మోహన్, పి.నరేష్, పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు వై. శ్రీనివాసులు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఛైర్మన్ ప్రవీణ్ కుమార్,పారా లీగల్ వాలంటీరు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ మేలుకొలుపు కళాజాత బందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్‌లో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ కళాజాత బృందం ఆలపించిన గేయాలు, నత్య ప్రదర్శన శనివారం నిర్వహించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అంటూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బందం సభ్యులు వెంకటేశ్వర్లు, నాసర్, బాబు, శ్రీనివాసరావు, ఏడుకొండలు, ఎస్‌కె.కరిముల్లా, బాషా, రాజా, వెంకటశివ, సుందరి, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల పరిధిలోని చిన్నారికట్ల, పెదారికట్ల గ్రామాల్లో పొదిలి సిఐ మల్లికార్జునరావు, ఎస్ఐ మాధవరావు ఆధ్వర్యంలో కేంద్ర పారా మిలిటరీ బలగాలు, పోలీసు సిబ్బంది శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సార్వత్రికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించు కునేలా భరోసా కల్పిస్తూ గ్రామాల్లో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పారా మిలిటరీ బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

23 నుంచి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ క్రీడా ప్రాంగణంలో అడ్వాన్సుడ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఎస్ఎ) ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయిలో టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30,116, రెండవ బహుమతిగా రూ.20,116, మూడో బహుమతిగా రూ.15,116, నాలుగో బహుమతిగా రూ.10,116 అందజేసున్నట్లు తెలిపారు. అదే విధంగా ఉత్తమ ప్రదర్శన కనపరిచిన క్రీడా కారులకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ క్రికెట్ పోటీలను ఒంగోలు రూరల్ సిఐ అజయ్ కుమార్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 78935 91227, 8919 431891 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా టంగుటూరులోని భాష్యం స్కూల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టంగుటూరు అగ్నిమాపక కేంద్రం అధికారి ఎ.రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా రమణారెడ్డి అగ్నిమాపక వారోత్సవాల గురించి వివరించారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సి అంశాల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది బంగారుబాబు, బి.పాల్, డి.వెంకటేశ్వర్లు, పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొండపి : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి సి హెచ్. వెంకటరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద ప్రమాదాల నివారణపై ప్రజలకు శనివారం అవగాహన కల్పించి కరపత్రాలు అందజేశారు. అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలనే అంశంపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండల పరిధిలోని కొట్టాలపల్లి గ్రామంలో టిడిపి నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అధికారంలోకి అమలు చేసే పథకాల గురించి ప్రజలకు వివరించారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పించారు. టిడిపితోనే పేదల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ కొండు విజయ భాస్కర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కర్నాటి భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు కార్యదర్శి కొండు శ్రీనివాసులు రెడ్డి, మరపగుంట్ల మాజీ సర్పంచి ఒంగోలు శ్రీనివాసులు, నాయకులు బసిరెడ్డి పెద్దిరెడ్డి,యక్కంటి మాలకొండా రెడ్డి, కేలం చంద్ర శేఖర్ రెడ్డి, కొండు వెంకటేశ్వర్లు, మాల్యాద్రి రెడ్డిభూమిరెడ్డి, కృష్ణయ్య, కొండు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల డీలర్లతో సమావేశం

ప్రజాశక్తి-దర్శి

రైతులకు విక్రయిస్తే ఎరువులు, విత్తనాలలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ అధ్యక్షతన దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు, దొనకొండ మండలాలకి చెందిన ఎరువులు, విత్తనాల డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మేలైన ఎరువులు, విత్తనాలు ఎంచుకోవాలన్నారు. రైతులకు విక్రయించిన ఎరువులు, విత్తనాలకు తప్పని సరిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. నూతన రైతు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ బాలకృష్ణనాయక్, ఐదు మండలాలు ఎరువులు, విత్తనాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం కాలనీవాసుల నిరసన

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

బీసీకాలనీ (పాములవారి కాలనీ)లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు ఎస్.తిరుపతి రెడ్డి మాట్లాడుతూ పాములవారి కాలనీ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జలజీవన్ పథకం పనులు పూర్తి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొదిలి నరసింహులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

ఎస్పీ వకుల్ జిందాల్

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహణే లక్ష్యంగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బాపట్ల జిల్లాలోని రేపల్లె నియెజకవర్గం పరిధిలో చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శనివారం జిల్లా ఎస్పీ పరిశీలించారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు.

రేపల్లె నియోజకవర్గం లోని చెరుకుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంబొట్లపాలెం, గుళ్ళపల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను, నగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నగరం, బోరుమాదిగ పల్లి, యేలేటిపాలెం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను, నిజాంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపట్నం, ఆముదాలపల్లి, గోకర్ణమఠం తదితర సమస్యాత్మక గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని, పోలింగ్ కు ముందు రోజే తగిన లైటింగ్, బ్యారికేటింగ్ ఏర్పాటు చేయించుకోవాలన్నారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రత చర్యల తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అన్నిచోట్ల అభ్యర్థులు నామినేషన్ ప్రక్రియ ప్రశాంతవాతావరణంలో జరుగుతుందన్నారు. మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిలో గతంలో ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగిన లేదా జరగడానికి అవకాశం ఉన్న గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా, మిగిలిన వాటిని సాధారణ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలో చోటు చేసుకోకుండా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యలు, క్యూలైన్ల ఏర్పాటు, తగిన లైటింగ్, బారికేడింగ్ తదితర విషయాల గురించి పోలీస్ అధికారులతో సమీక్షించడం జరిగిందన్నారు. నిజాంపట్నం, చందోలు పరిధిలోని ఎస్.ఎస్.టి బందాలు ఎలా విధులు నిర్వహిస్తున్నారు, వాహన తనిఖీలు ఎలా నిర్వహిస్తున్నారు, వారి పనితీరు ఎలా ఉందని తనిఖీ చేసి వారికి సూచనలు ఇవ్వడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు రేపల్లె డిఎస్పి టి.మురళీకష్ణ , రేపల్లె రూరల్ సీఐ మల్లికార్జున, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'డ్వాక్రా' ఓటర్లపై ప్రత్యేక దృష్టి

- నియోజకవర్గంలో 64,210 మంది సభ్యులు

- డ్వాక్రా మహిళలను ప్రసన్నం చేసుకునే పనిలో టిడిపి, వైసీపీ

డ్వాక్రా సంఘాల సభ్యులు (ఫైల్)

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఏ రంగంలో చూసుకున్నా మహిళలు రాణిస్తున్నారు. అన్నింటిలోనూ ముందంజలో ఉంటున్నారు. ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో కూడా వారి శాతం అధికంగానే ఉంది. అకాశంలో సగం..అవకాశాల్లో సంగం అంటున్న మహిళలు ఓటరు నమోదులో సగభాగం ఉన్నారు. ఎన్నికలో అతివల ఓట్లే కీలకంగా మారనున్నాయి. అందులోనూ పల్లెల్లో ఉండే పొదుపు సంఘాల్లో ఉండే మహిళలు అధికంగా ఉండడంతో అభ్యర్థులు ఆ దిశగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అభ్యర్థుల విజయంలో డ్వాక్రా సంఘాల సభ్యులు కీలకం కానున్నారు. డ్వాక్రా మహిళలు ఓట్లను తమ పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలనే ఉద్దేశంతో ప్రధాన పార్టీలైన టిడిపి, వైసీపీలు వ్యూహాలను రచిస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళల ఓట్లపైనే ప్రత్యేక దృష్టి సారించారు.

64,210 మంది డ్వాక్రా సభ్యులు..

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో పొదుపు సంఘాలు పని చేస్తున్నాయి. వీటి పరిధిలో 6421 సంఘాలు, 224 సమాఖ్యలు పని చేస్తున్నాయి. ఒక్కో సంఘానికి పది మంది చొప్పున ఉండగా మొత్తం 64,210 మంది మహళలు పొదుపు గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఓటర్లుగా నమోదై ఉండడంతో ఈ ఎన్నికల్లో వీరే కీలకంగా వ్యవహరించనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారాలను కొనసాగిస్తుండగా మహిళలను కలుసుకొని ఓట్లు అభ్యర్థించడం కనిపిస్తోంది. మరోవైపు వచ్చే నెల 13న ఎన్నికలు ఉండగా ఆ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రచారం నిర్వహిస్తోంది. ప్రధాన రాజకీయలు పార్టీ తాము మళ్లీ అధికారంలోకి వస్తే స్వయం సహాయక సంఘాలను మరింత ఆర్థిక చేయూత అందిస్తామని, మహిళల ఆర్థిక స్వావలంబనకు అండగా నిలుస్తామని ప్రచారాల్లో వాగ్ధానాలు గుప్పిస్తున్నారు.

కీలకం కానున్న డ్వాక్రా సభ్యుల ఓట్లు..

యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం 2,05,300 ఓట్లు ఉండగా 1,01,077 మంది మహిళా ఓటర్లు ఉండగా అందులో సగం మంది 64,210 మంది మహిళలు పొదుపు సంఘాల్లో ఉన్నారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నాయి. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళా ఓటర్ల దగ్గరకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు పరుగులు పెడుతున్నారు. పొదుపు మహిళలను మమేకం చేసుకుంటూ ప్రచారం చేస్తున్నారు. సంఘాల్లోని లీడర్లతో సభ్యుల ఓట్లను వేసేలా చూడాలని అభ్యర్థిస్తున్నారు. అధికారంలోకి వస్తే సంఘాలకు ఏ విధంగా మేలు చేస్తామనే విషయాన్ని స్పష్టంగా వివరించడం, అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. తాము అధికారంలోకి వస్తే మహిళలకు డ్వాక్రా రుణమాఫీ చేస్తామని, వడ్డీలేని రుణాలు అందిస్తామని భరోసా ఇస్తున్నాయి. మిగతా రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి వస్తే ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తామని, రేషన్‌కు బదులు నగదు అందిస్తామని వాగ్ధానాలు ఇస్తున్నారు. ఓటు హక్కు వినియోగంలోనూ డ్వాక్రా సంఘాల సభ్యులు ముందుంటారనే భావన ఉండడంతో, వారి ఓట్లను తమకు అనుకూలంగా మార్చుకుంటే ఎన్నికల్లో విజయం సులువని ఆయా పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు. గతంలో పోలిస్తే డ్వాక్రా మహిళల ఆలోచన విధానంలో కూడా మార్పు వచ్చినట్లుగా తెలుస్తోంది. గతంలో ఆయా రాజకీయ పార్టీల వాగ్ధానాలను క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును బేరీజు వేసుకుంటున్నారు. ఆయా గ్రామాల వారీగా గ్రామసంఘం సమావేశాలు ఏర్పాటు చేసుకొని వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇస్తే బావుటుందనే ఆలోచనలు చేస్తున్నట్లుగా సమాచారం.

నియోజకవర్గంలో మండలాల వారీగా సంఘాలు, సభ్యుల వివరాలు..

మండలం	మహిళా ఓటర్లు	పొదుపు సంఘాలు	సభ్యులు	గ్రామ సమాఖ్యలు
యర్రగొండపాలెం	23,658	1493	14,930	50
పుల్లలచెరువు	20,292	1338	13,380	51
త్రిపురాంతకం	24,055	1402	14,020	40
పెద్దదోర్నాల	16,611	1140	11,400	48
పెద్దారవీడు	16,461	1048	10,480	35
మొత్తం	1,01,077	6421	64,210	224

శాశ్వత అభివృద్ధి చూపాలి

పాలువాయి శకుంతల,
పొదుపు మహిళ, వేగినాటి కోటయ్య నగర్

తాత్కాలిక ప్రాతిపదికన కాకుండా శాశ్వత అభివృద్ధికి చేయూతనిచ్చేలా పనులు చేయాలి. ఎన్నికల్లో ఆయా పార్టీల నేతలు చేసే వాగ్ధానాలు అధికారంలో వచ్చాక నిలబెట్టుకోవాలి. అటువంటి వారికే వచ్చే ఎన్నికల్లో ప్రాధాన్యమిస్తాం.

మహిళా సాధికారితకు కృషి చేయాలి

దాసరి దేవి, పొదుపు మహిళ, యర్రగొండపాలెం

మహిళా సాధికారితకు, స్త్రీ అభివృద్ధికి ఏ పార్టీ కృషి చేస్తుందో, మహిళా సంక్షేమం కోసం ఏ నాయకుడు పాటు పడతారో వారికే ఓటు వేస్తాం. ప్రస్తుత కాలంలో తమకూ ఓటు హక్కు వినియోగంపై అవగాహన పెరిగింది. అన్నీ ఆలోచించుకొని సభ్యులంతా సమావేశమై.. తమకు న్యాయం చేసే వారికే మద్దతు ఇస్తాం.

మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

షర్మిలా రెడ్డి పర్యటనను జయప్రదం చేయండి

డిసిసి అధ్యక్షులు ఈదా సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి ఈనెల 22న యర్రగొండపాలెం రానున్నారని, ఈ పర్యటనను జయప్రదం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఈదా సుధాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక డిసిసి కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఈదా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 22న కాంగ్రెస్ పార్టీ యర్రగొండపాలెం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి బూదాల అజితారావు గారి నామినేషన్ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో జరిగే బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ పార్టీ ఏడు నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు అందరూ వేలాదిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి సెల్ లో వర్కింగ్ ప్రెసిడెంట్ ఉద్ధండి మల్లికార్జునరావు, పిసిసి సభ్యులు షేక్ రసూల్, జిల్లా అధికార ప్రతినిధి మన్నం ప్రసన్నరాజు, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు వలపర్ల మోషే, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గోరంట్ల కోటేశ్వరరావు, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఉంగరాల శ్రీనివాసరావు, ఒంగోలు మండల పార్టీ అధ్యక్షులు తెలగలపూడి బుజ్జి పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాలో 8 నామినేషన్లు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల పార్లమెంట్ స్థానానికి శనివారం ఎవరు నామినేషన్లు వెయ్యలేదు. వేమూరు అసెంబ్లీ స్థానానికి పిరమిడ్ పార్టి తరపున కె విజయకుమార్, రేపల్లే అసెంబ్లీకి బహుజన్ సమాజ్ పార్టి తరఫున డొక్కా శ్రీనివాసరావు,బాపట్ల అసెంబ్లీ కి టిడిపి తరపున వేగేశన హరికుమారి, స్వతంత్ర అభ్యర్దులుగా ఉప్పాల మురళి,కె వినయరాజ్ నామినేషన్లు దాఖలు చేశారు.అద్దంకి నుంచి కాంగ్రెస్ పార్టి తరఫున ఎ కిశోర్ బాబు,పిరమిడ్ పార్టి తరపున జి సదాశివరావు, బహుజన్ సమాజ్ పార్టి తరపున మండా జోసఫ్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.పర్చూరు, చీరాల నుంచి ఎవరు నామినేషన్లు వెయ్యలేదు.

'కదిరి'కి సత్కారం

ప్రజాశక్తి-సిఎస్‌పురం

కదిరి బాబూరావు విద్యాసంస్థల సెక్రెటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథిని బిటిఎ రాష్ట్ర నాయకుడు శీలంవారిపల్లిలోని కెబిఆర్ కళాశాలలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్థసారథిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భైరవకోన ట్రస్ట్ బోర్డు మాజీ మెంబర్ లక్కిపోగు ప్రసాద్, వైసిపి ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు లక్కిపోగు ప్రకాష్, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు ఎలీషా, డేవిడ్, ఆనంద్‌రావు, కెబిఆర్ కళాశాల డీన్ త్రిమూర్తులు, మాలకొండయ్య పాల్గొన్నారు.

భైరవకోనలో కదిరి కుటుంబం పూజలు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యటన క్షేత్రమైన భైరవకోనను మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు కుటుంబ సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా త్రిముఖ దుర్గా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం త్రిముఖ దుర్గా అమ్మవారికి రూ.1.25 లక్షల విలువైన వెండి కిరీటం, బంగారపు ముక్కుపుడక అందజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి బాబూరావు దంపతులు, కదిరి ప్రకాష్‌రావు దంపతులు, కదిరి పార్థసారథి దంపతులు, కదిరి రమణయ్య దంపతులు, రాజేష్, రమ్య, సుగుణ, తనూజ, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం వీరాభిమాని వీరంరాజుకు ఘన నివాళి

బైటమంజులూరులో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి-పంగులూరు

సిపిఎం వీరాభిమాని జొన్నలగడ్డ వీరంరాజు అంత్యక్రియలు శనివారం బైటమంజు లూరులో ఘనంగా నిర్వహించారు. ముందుగా వీరంరాజు మృతదేహానికి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాశక్తి ప్రతినిధులు పూలమాలలు వేసి.. ఘనంగా నివాళులర్పించారు. రోడ్డుప్రమాదం లో గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీరంరాజు శుక్రవారం మరణించిన విషయం పాఠకులకు తెలిసిందే.. వీరంరాజు చిన్న కుమార్తె 'ప్రజాశక్తి' స్నేహ సబ్ఎడిటర్ సరికొండ పద్మావతి తండ్రి పాడెను మోశారు. తనను చిన్నప్పటి నుండి ఎంతో ప్రేమతో పెంచి, చదివించి పెద్ద చేసిన తండ్రి భౌతిక కాయాన్ని మోస్తూ.. పద్మ విలపించారు. ముందుగా ప్రజాశక్తి సంపాదకులు తులసీదాస్, ప్రజాశక్తి రాష్ట్ర బాధ్యులు గడ్డన్న, శాంతి శ్రీ, సుధా, సిపిఎం సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ కారుసాల శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు వై.సిద్ధయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి సరికొండ అనిల్, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎల్వి.ప్రసాద్, సర్క్యులేషన్ ఇన్ఛార్జి బ్రహ్మయ్య, ప్రజాశక్తి అద్దంకి డివిజన్ ఇన్ఛార్జి బి.విజయ్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు రాయిని వినోద్బాబు, సిఐటియు బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. మజుందార్, కెవిపిఎస్ ప్రకాశం జిల్లా కార్యదర్శి బి.రఘురాం, సిపిఎం నాయకులు బి.వెంకట్రావు, బత్తుల శ్రీనివాసరావు, సిఐటియు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు సరికొండ రామచంద్రరాజు, సిపిఎం బైటమంజులూరు శాఖ కార్యదర్శి పూసపాటి సుబ్బరాజు, వైసిపి నాయకులు చక్రవరం భాస్కరరాజు, తిరుమలరాజు, మాజీ సర్పంచ్ శివరాజు, మాజీ ఎంపీటీసీ అచ్చిరాజు, జొన్నలగడ్డ కష్ణంరాజు తదితరులు పాల్గొని.. వీరంరాజు మృతదేహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

వీరంరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్

మోడల్ ఎంసెట్ విజయవంతం

పాల్గొన్న 1000 మంది విద్యార్థులు

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా కమిటీ, బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బ్రిలియంట్ కంప్యూటర్ సెంటర్లో శనివారం జరిగిన మోడల్ ఈఏపీ సెట్(ఎంసెట్) విజయవంతమైంది. ఈ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆన్లైన్ మోడల్ ఈఏపి సెట్లో పాల్గొనటం ఎంతో ఉపయుక్తకరంగా ఉందని, ఆన్లైన్లో పరీక్షలు రాయడం అలవాటు అయిందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్, జిల్లా, నగర కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఆన్లైన్ మోడల్ ఈఏపి సెట్లో పాల్గొన్న విద్యార్థులు

టిడిపి గెలుపు కోసం సైన్యంలా పనిచేయాలి

చీరాల అభ్యర్థి ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

ఆంధ్రప్రదేశ్ అభివద్ధికి అహర్నిశలు కషి చేస్తూ పెద్ద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న చంద్రబాబు ప్రజా సేవకుడని టిడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం ఎం కొండయ్య అన్నారు. టిడిపి గెలుపు కోసం అందరూ సైన్యంలా పనిచేయాలని సూచించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదినోత్సవం సందర్భంగా డాక్టర్ సజ్జ హేమలతతో కలసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కార్యకర్తల సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.అనంతరం నాయకులు బూత్ కన్వీనర్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజల భవిష్యత్తు అవసరాలను గుర్తించి వారిని అభివద్ధి చేసే విజినరీ ఉన్న వ్యక్తి చంద్రబాబు అన్నారు.ఎన్నికల సమయం ఆసన్నం అయ్యింది అని తెలుగుదేశం పార్టీ గెలుపుకు నాయకులు, కార్యకర్తలు,బూతు కన్వీనర్లు, సమిష్టిగా సైనికులుగా పనిచేసి టిడిపిని గెలిపించుకోవాలని అన్నారు. నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు.ఎన్నికల నిర్వహరణలో కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జిలు,వార్డ్ నాయకులు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ మేనిఫెస్టో ప్రజలు విశ్వసిస్తున్నారని పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్యను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పలు అంశాల గురించి ఎన్నికల వ్యూహంపై బూత్ కన్వీనర్ లకు, పోల్ మేనేజ్మెంట్ కు దిశ నిర్దేశం చేశారు. వార్డ్ కమిటీ సభ్యులతో సమావేశంలో యువ నాయకులు గౌరీ అమర్నాథ్,మహేంద్ర నాథ్, పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎం కొండయ్య

టిడిపిలో చేరిక

వైసిపి అరాచక పాలనకు విస్తుపోయిన రాష్ట్ర ప్రజలు చంద్రబాబును పాలనా కోరుకుంటూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఎదురుచూస్తున్నారని నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం వేటపాలెం మండలం రామన్నపేట గ్రామంలో నుండి పలువురు టిడిపి కు మద్దతు తెలియజేయగా డాక్టర్ సజ్జా హేమలతతో వారికి పార్టీ కండువాలు కప్పారు. కొండయ్య సమక్షంలో టిడిపిలోకి చేరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు ఎన్ ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గుమ్మళంపాడులో టీడీపీ ప్రచారం

తెలుగుదేశంలో చేరిన రాఘవరావు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని గుమ్మళంపాడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు నువ్వల రాఘవరావు శనివారం టీడీపీ లో చేరారు. ఆయనకు నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి బి. ఎన్. విజయ్ కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గుమ్మళంపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శంఖారావం, బాబు సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర జనసేన పార్టీ అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, బాపట్ల పార్లమెంట్ సెక్రటరీ తన్నీరు శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు మొలకలపల్లి శ్రీనివాసరావు, పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షులు నెప్పల సుబ్బారావు, మాజీ సర్పంచ్ నెప్పల కనకయ్య, మండల సెక్రటరీ తాటితోటి నరసింహారావు, బొడ్డపాటి రమణారావు, బొడ్డపాటి వెంకటరమయ్య పాల్గొన్నారు.

ప్రచారంలో బిఎన్.విజయ్కుమార్

టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శిగా మురళి

ప్రజాశక్తి-కొత్తపట్నం

తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం ఒంగోలు నియోజకవర్గ కార్యదర్శిగా కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి చెందిన షేక్ మురళి బాబును నియమిస్తూ ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ సాధ్యమైనంత వరకు పార్టీకి ఎక్కువ సమయం కేటాయించి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని తెలియజేశారు. మీకు ఇచ్చిన పదవికి తెలుగుదేశం పార్టీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జనార్ధన్ను సత్కరిస్తున్న మురళి

ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలి: ఎస్పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఎస్.ఎస్.టి బందాలను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల అక్రమ రవాణాను అరికట్టడానికి చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 216 పై ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టి చెక్ పోస్ట్, నిజాంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పసుమర్తి వారి పాలెం లోని అల్లూరి లాకులు వద్ద ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.టి చెక్ పోస్ట్ లను జిల్లా ఎస్పీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో రేపల్లె డిఎస్పి టి.మురళీకష్ణ పాల్గొన్నారు.

ఒంగోలులో కుంటుపడిన అభివృద్ధి

- అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల
- ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో దుష్టపాలన పోవాలన్నా, అభివృద్ధి జరగాలన్నా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కూటమి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు పిలుపునిచ్చారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఐదేళ్ళ పాలనలో అభివృద్ధి కుంటిపడిందని, మే 13న జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఒంగోలు నగరంలోని 34వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా 34వ డివిజన్ పార్టీ కార్యాలయంలో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరిపారు. వేడుకలలో భాగంగా దామచర్ల జనార్ధనరావు కేక్ కోసి మిఠాయిలు పంచి సంతోషాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక అభివద్ధి, సంక్షేమ పాలన అందించిన ప్రజా నాయకుడు చంద్రబాబు నాయుడు అడుగు జాడలలో నడవడం సంతోషంగా ఉందన్నారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతకు అత్యంత ప్రాధాన్యమిచ్చే చంద్రబాబు నాయుడు వంటి నాయకునితో పని చేసే అదృష్టం రావడం ఆనందదాయకమన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే విజన్ ఉన్న నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలియజేశారు. రానున్న ఎన్నికలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసి కట్టు విభేదాలు మరచి కలసి కట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇందు కోసం క్షేత్ర స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పోరాడాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు టిడిపి అండగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి, తాతా ప్రసాద్, నగర అధ్యక్ష, కార్యదర్శులు కొఠారి నాగేశ్వరరావు, దాయనేని ధర్మ, పెద్దిశెట్టి వరలక్ష్మి, జనసేన పార్టీ నగర అధ్యక్షులు మలగా రమేష్, బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యానం చిన్నయోగయ్య యాదవ్, బొద్దులూరి ఆంజనేయులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దామచర్ల జనార్ధనరావు